పెంపుడు చిలుక

వేలూరి శివరామశాస్త్రిగారు

౧

రామనాథబాబు హావేలీ జమీందారు. అతనికి ప్రాయము దాఁటినపిమ్మట వెంకయ్యమ్మారావు అను కూఁతురు. రామనాథబాబునకు వ్యపదేశివద్భావముచే కూఁతురైనను కొడుకైనను వెంకయ్యమ్మారావుగారే.

ఆమె చిన్నారిపొన్నారి చిఱుతవయసున ముద్దులకూచి; అందచందాల యౌవనమున గయ్యాళిగంప; ఆమె పవలంతయు లాగులలోను, రాత్రులంతయు లంగాలలోను. జమీందారీ వ్యవహారపు అడుసున నడుమనడుమ ఆమె చేతిగోఁరలుకూడ అంటుచుండెను.

వయసు ముదిరినను కూఁతుపెండ్లిని రామనాథబాబు లోఁగడ తలపెట్టలేదు కాని, ఇపుడు తనశరీరమున నంజు అంటుకొక్కఁగా ఆప్రయత్నముమీఁదనే ఉండెను. ముందు స్వయంవరగృహమొకటి కట్టించెను. దాన బస చేసిన వరుఁడు మూఁడవ అంతస్థులో నున్న రాజపుత్త్రికి స్పష్టముగా కనఁబడును.

ఈ స్వయంవర మంటపమునకు రాజకుమారులందఱు ఒక్కసారిగా రారు. ఒకరితరువాత నింకొకరు. సరస్వతి చేటియంబు వచ్చి, ఇఁతడు చోళాధీశుఁడు; ఇతఁడు నేపాళాధీశుఁడు; ఇతఁడు నీమెదకు కస్తూరి తెచ్చునసిగాని, ఇతఁడు నీమొగమునకు వేసలీను పూయుననిగాని వర్ణింపదు. మరి నవుకరులు వచ్చి కంచెఁడుకూడు తినుననియు, కాళ్లు తానే కడుకుకొనుననియు, వెలకిలఁ బరుండుననియు వర్ణింతురు. రాజకుమారి గంభీరముగా చూచి ఊరకుండదు. వీఁడు వృషభము, వీఁడు భషకము, వీఁడు మహిషము అని వెంటనే పేరులు పెట్టి వెడల నడిపించును. ఇటులు జంతువుల నామములు, జడముల నామములు ఇంచుమించుగా వ్యయమాయెను.

రామనాథబా బెంతతొందరపడుచుండెనో అంత యాలస్య మగుచుండెను. తుదకు ఆర్వీటినుండి జనార్దనరావుగారు స్వయంవర మంటపము ప్రవేశించిరి. లోఁగడ వచ్చినవారిలో చాలమందితో వచ్చిన కూలినవుకరులవలె ఆయనతో ఒకఁడును రాలేదు; కాని బి. యే. డిగ్రీమాత్రము వచ్చెను.

ఈమాట వినిన వెంటనే రాజకుమారి మేడపైనుండి చూచెను. చూచునది చూచుచునే నిలువఁబడిపోయెను. 'టెలెస్కోపు తెచ్చియీయనా?' అని దాసి యనెను.

వెంకయ్యమ్మారావుగారు దానిమ్మపండ్లు, సపోటాలు, నారింజలు, బత్తాయిలు, చక్రకేళీలు, ద్రాక్షలు తీసికొనిపోయి యిచ్చి రమ్మని ధీరముగా పలికెను.

రామనాథబాబు అనుజ్ఞచే మంత్రి స్వయముగా జనార్దనరావుగారికి స్వాగతమిచ్చెను. ఒకటి రెండు సారులు రాజకుమారి మేడక్రింద నుండి ఏదోమిష పెట్టి జనార్దన రావుగారిని అటూ ఇటూ నడిపించెను. స్వయంవర మంటపమున కుర్చీలో ఒకానొక అంగభంగిగా కూర్చుండబెట్టెను; నిలువబెట్టెను; పండఁ బెట్టెను. ఏమి చేసినను నాణెము ఇంచుకయు ఓటిది కాదు.

రాజకుమారి అంతయు జూచెను; నవుకర్లచే అంతయు వినెను. తుదకు అతనికి 'పెంపుడుచిలుక' యని పేరుపెట్టెను.

ఆపేరుపెట్టుట కొక సంబంధ మున్నది. తనగది ముంజూరునందు వ్రేలాడ-దీసిన బంగారుపంజరమున రెండు చిలుకలు ఉన్నవి.

తుదకు వ్యవహార మిటులు ఫైసలాయెను; ప్రథమపురుష సంతానము జమీాది; రాజకుమారి పుట్టినింటనే యుండును; ఇష్టము కలుగుచో అత్తిల్లు మెట్టును; పురుష సంతానము కలుగువఱకు అల్లుఁడుమాత్ర మత్తింటనే యుండి తీఱవలయును. జమీాకి అతఁడు నిత్యమును అతిథియు, అక్రీతదాసుఁడును.

కాకితములు పుట్టి రిజిష్టరు అగుటతో పాటు అతివైభవముగా వివాహము జరిగెను.

పెంపుడుచిలుకను ఒక బంగారు పంజరమున బంధించిరి. అవసరములయందు పండ్లు పెట్టిరి. 'రామన్నా, తోఁటకూర' అని నేర్పఁగా ఆచిలుక మరల 'రామన్నా, తోఁటకూర' అని అనుట అతికష్టముగా నేర్చుకొనుచుండెను.

పెండ్లివైభవము చేతులార చేసికొని, కనులార చూచుకొని, రామనాథబాబు రంగస్థలమునుండి నిష్క్రమించెను. ఆపాత్రయొక్క అభినయ మంతయు ఇపుడు వెంకయ్యమ్మారావుగారే చేయ దొరఁకొనెను.

౨

పండ్లు దొరకని చిలుకకు పండ్లు దొరకువో పంజరబంధముకూడ కొన్నాళ్లు పండువే. పండ్లు నోరార దొరకినను నిత్యము పంజరబంధ మగుచో, ఆ పంజరము — సువర్ణమయమే యగుఁగాక — గర్భనరకము. ఆచిలుకచూపెపుడును అనంత-ఆకాశముమీాఁదనే. పక్షియయినను దానికి పక్షములు లేవు. అది చేతనియయినను జడము. దానితో కొంతసేపు కొందఱు క్రీడింతురు గాని ఆలావణ్యము సహజసిద్ధమగుటయే స్వయంకృతాపరాధము. కాకిని పంజరమున ఎవఁడు ఇడుకొనును?

వెంకయ్యమ్మారావుగారికి కుమారుఁడు కలిగెను. జమీా యంతటను నిత్యకల్యాణము పచ్చతోరణము. మహేంద్రవైభవముతో బారసాల. శిశువుపేరు రామనాథబాబు. పెంపుడు చిలుకకు పంజరకవాటము కొంచెము సడలెను. ఒకరెక్క స్వాధీనమాయెను.

జనార్దనరావుగారికి అనుకొనినపుడల్లా కుమారుని చూచుకొనుటకు వీలు లేదు. భార్య

మాట వేఱుగా చెప్పనక్కఱలేదు. తన పుత్త్రుని నోరార పిలుచుకొన వీలు లేదు. రామనాథబాబుగారూ అని అన్నియక్షరము లును పట్టి పట్టి అనవలయును. ఏల? ఆయనయే జమీందారు; ఆయన వెంకయ్యమ్మారావు గారి కుమారుఁడు.

జనార్దనరావునకు భార్యాపుత్త్రులబదులు దాపున పుస్తకము. అతనికి మన స్తత్వశాస్త్ర మునందు (Psychology) అభిరుచి. అతఁడు ఆపరిజ్ఞానము చేతనే ఇన్నాళ్లు పంజరమునఁ గడపఁగలిగితి ననుకొనెను. విచారించుచో తనకును తెలియకుండ అనురాగబంధముచేతనే పంజరబంధము సైరించెనేమో!

అతఁ డిపుడు స్త్రీపురుషులకు సంబంధించిన మన స్తత్వమును రచించుచుండెను. అనుభూతమైన ప్రతివిషయమును ఉదాహరణముగాఁ గొనుచుండెను. తనకడకు వచ్చిన సేవకుని, వాఁడు తెచ్చిన ఆహారమునుగూడ తెలియని ఏకాగ్రతతో దానిని వ్రాయుచుండెను. ఒకానొకపుడు ఎవరుపిలిచినను అతఁడు చెవిటి.

వెంకయ్యమ్మారావు గారికి ఈవైనము తెలిసెను. ఒకనాఁడు ఆమె చక్కఁగా అలంకరించుకొని భర్త అంతఃపురములోనికి ఎవరికిని తెలియకుండ వెళ్లెను. అటులు వెళ్లుట కదే మొదలు.

అతఁడు వ్రాఁతలో మునిఁగి తేలుచుండెను. భార్యను చూచినంతనే కాకితము లావల త్రోసి, చూచినవాఁడు చూచినటులే యుండెను. అనుకొనని గౌరవము!

ఉభయతటములు నిండిన ప్రవాహము వలె, పూలతో పండ్లతో నిండిన తీవవలె, మనుష్యదేవతవలె ఆమె నిలువఁబడెను. అతఁడు



భార్యకేసి రెండుచేతులూ చాఁపెను.

వెంకయ్యమ్మారావు ఒకనవ్వు నవ్వెను. తృణీకృతబ్రహ్మపురందర మా నవ్వు; మర్మావిధ మా నవ్వు; హృదయభేది ఆనవ్వు.

ఏదీ చూతము, పాఠకుఁడా, నీవు నవ్వ మా నవ్వు! పోనీ, అర్థము చేసికొన్నఁ జాలును! కావలసిన దంతయే.

ఇటులు నవ్వి వెంకయ్యమ్మారావు—'నన్ను పెంపుడులేడి యనుకొంటివా, చేతులతో దువ్వుటకు, ముద్దిడుటకు' అనెను. జనార్దనరావున కిట్టి ప్రసంగములు క్రొత్తలు కావు.

ఆమె సి. ఐ. డి. ఇన్‌స్పెక్టరువలె ఆగదిలోని పుస్తకములన్నియు చూచెను. వ్రాయుచున్న కాకితములు విప్పి నడుమనడుమ పరిశీలించుచుండెను.

దాసి యొకతె వడిగా వచ్చి, 'చిన్నమ్మారావుగారికొఱకు వరుఁడిపుడే స్వయంవర మంటపమున విడిసె'నని చెప్పెను. మరొకదాసి వచ్చి, 'వ్యవహార పర్యాలోచనమునకు దివాను బహద్దరు తెరచాటున కాచికొని యుండె'నని మనవిచేసెను. విని వెంకయ్యమ్మారావుగారు 'సరి' యని పిమ్మట "ఓసీ, నీ వీ కాకితములకట్టనాగదిలోపెట్టు"మనెను. దాసి తీసికొనివెళ్లెను.

వెంకయ్యమ్మారావు భర్తను చూచి- "తాము నేఁటిరాత్రి ఏడుగంటలకు నాగదిలోనికి దయచేసి నన్ననుగ్రహింపవలెను" అనెను. జనార్దనరావుగారికి ఇది యొక క్రొత్తగౌరవము.

"మాటాడ రేమి?"

"దాసిని బంపుచో వత్తును."

జనార్దనరా విటు లనుటకు ఇదియే మొదలు. వెంకయ్యమ్మారావు పనులమీఁద వెళ్లిపోయెను.

ఏడుగంట లాయెను; దాసి రాలేదు. ఎనిమిది యాయెను; రాలేదు. తొమ్మిది; పది; పదొకొండు; పండ్రెండు. దాసి రాదు.

జనార్దనరావు దాదికిపదిరూకలిచ్చికుమారుని తొట్టికడ కేఁగెను. రెప్పవాల్పక చూచెను.

"కోయిల తనగ్రుడ్డును తాను పొదిగికొనలేదు. నాయనా, పెద్దవాఁడ వైన పిదప మీయమ్మవలె నన్ను మఱవకు."

అతఁడు బాలు నొకసారి యెత్తుకొనెను.



నేను నీవాఁడ నన్నటులు బాలుఁ డూరకుండఁగా, తండ్రి ముద్దుకొని మరల తొట్టియ నుంచెను.

"నీవు నీతల్లిపోలిక; తల్లిచాల మంచిది. వెళ్లునపుడు నిన్నువలె నీతల్లినిగూడ చూడఁదలఁపుగాని అందులకు నాకు భాగ్యము లేదు. బాలుఁడా, నన్ను మఱవకు. దాదీ, నాపలుకును పెద్ద అయినపిదప ఇతనికి చెప్పుదువా?" అని దానికి మరికొన్ని రూకలిచ్చి తొట్టిచూ

చుచు కనుల నీరు గ్రమ్మఁగా వెనుదిరిగి పోయెను.

జనార్దనరావుగారు వెళ్లిపోయిరని ప్రొద్దుననే సేవకుఁడు వెంకయ్యమ్మారావుగారికి విన్నవించెను. "ఓరీ, నల్లమందువేళకు ఉడుత తానే వచ్చును" అనెను వెంకయ్యమ్మారావు గారు.

3

చిన్నమ్మారావు తనకు మేనత్తకూఁతురు. ఆమె పోషణమంతయు తనమీఁదనే యుండెను. చిన్నమ్మారావుకూడ తన అదుపు ఆజ్ఞలలో ఉండెను. ఆమె కిపుడు పెండ్లి; ఇల్లటమునకు వరుఁడు వచ్చెను. నియమము లన్నిటికి అతఁడు తల నూఁపెను.

వెంకయ్యమ్మారావు చిన్నమ్మారావును దాపునకు బిలిచి, 'ఈ గంగిరెద్దు నీకు బాగుండెనా?' అని అడిగెను.

దాసీలు కొందఱు ఈ నామకరణమునకు సంతసించిరి. కొందఱింకను రాణి మోమును జూచుచుండిరి. ఇంకను మంచిపేరు కావలయుఁగాఁబోలు! కొందఱు పకపక నవ్విరి.

చిన్నమ్మారావు చీరముడుతలు సవరించుకొనుచు మోము వంచి తన నెవరో వెనుక పిలిచినటులు లోనికి వెళ్లిపోయెను.

వెంకయ్యమ్మారావు వరుఁడు వెంకటరాయణిం గారికి పదివేలరూపాయలు, వెండి బిందెలు, బంగారు హారములు, వజ్రము మలఁచిన ఉంగరము, రాతికట్టడపు అంటుజోడు, గుర్రమును కట్నమిచ్చెను. ముప్పదివేలు రాఁబడిగల గ్రామము కొని చిన్నమ్మారావునకు ఫెళ్లుమని పెండ్లి చేసెను. తానొక్కతయే పెండ్లికూఁతును ధారపోసెను.

గ్రామపాలనమును గుఱించిన వ్యవహార మంతయు భర్తతో సంబంధము లేకుండ నిర్వర్తించుకొను ప్రక్రియను వెంకయ్యమ్మారావు చిన్నమ్మారావునకు నేర్పెను. ప్రథమసంవత్సరము చిన్నమ్మారావు తనవ్యవహార మంతయు తానే చేసికొనెను. రెండవసంవత్సరమునుండియు కొంతకొంత తగ్గించుకొని క్రమక్రమముగా అంతయు భర్తపరము చేసెను.

చిన్నమ్మారావుకు చిన్నతనమునుండియు ముందటేఁటివఱకు వెంకయ్యమ్మారావు గారికడనే కాలక్షేపము. వెంకయ్యమ్మారావు గారును అన్నము తినునపుడు, నీరు త్రావునపుడు, షికారు వెళ్లునపుడు, నిద్రించునపుడు, ఆటలాడుకొనునపుడు, పాటలు పాడుకొనునపుడు, కూర్చుండునపుడు, వ్యవహరించునపుడు చిన్నమ్మారావును ఉచ్ఛ్వాసనిశ్వాసములవలె ఎడఁబాయకుండెడిది. అట్టి చిన్నమ్మారావు ఇపుడిపుడు తాను పిలిచినను కొన్నివేళల దర్శనమునకు రాఁదొడఁగుట లేదు. కారణమడుగుచో ఎపుడు ప్రత్యుత్తరించినను తన భర్తకు సంబంధించిన విషయమే చెప్పుచుండెడిది. వెంకయ్యమ్మారావుగారు—'గంగిరెద్దు ఆయనకాదు; నీవు' అనుచుండెడిది.

ఒకనాఁటి రేయి ఆమె చిన్నమ్మారావును పిలిచికొని రమ్మని దాసిమీఁద దాసిని బంపెను. దాసిక లందఱు తిరిగివచ్చి—‘తలుపు వేసికొని పలుకనైన పలుకలేదు’ అని మనవిచేసిరి.

ఆమె దాసీల సందఱు నక్కడనే ఉండ నియమించి తాను వెళ్లెను. గవాక్షమునుండి



తొంగిచూచెను. ఒడలు జల్లుమనెను. ‘నాకీ యదృష్టమేదీ?’ అనుకొనెను. తిరిగివచ్చి ఆలోచించుచు కూరుచుండెను.

దాసీ లందఱు ముక్కుమీఁద వేళ్లువేసికొని నిలువఁబడియుండిరి. సమయము కనిపెట్టి ఒకదాసి ‘అమ్మా, ఆమెకు మగఁడు మందు పెట్టెను’ అనెను. మఱొకతెఁ ‘ఏమందో పెట్టనిచో సతనిత్యము మగనిముందెటులుండును?’ అనెను. ‘అదేమో కాని ఏ మున్నదమ్మా అప్పనము మగనికడఁ బడియుండుటకు?’ అని యింకొకతె యనెను.

వెంకయ్యమ్మారావు దాసికలఁజూచి ‘అటువంటి మందు ఉండునా?’ అని యడిగెను. ‘ఉన్నవి ఉన్న’వని ప్రతివైపునుండియు ఉదాహరణపూర్వకముగా సమాధానములు తామరతంపరగా బయలుదేరెను. వెంకయ్యమ్మారావు ఆశ్చర్యముతో వినుచుండెను.

కొంతవడి ఎవరును మాటలాడక తాము చెప్పిన అపూర్వవిషయముయొక్క సత్యము గ్రహింప రాణి కవకాశమిచ్చిరి. ఆమె ఒకతూరి ప్రబలముగా నిట్టూర్చెను.

కీరవాణి యను దాసి—అమ్మా, మందు లకేమిగాని, ఆమెకు మగడే మందు’ అనెను. ఇంకొకతె ‘నీకో’ అనెను. దానినిగూర్చి మరియొకతె ‘నీకో’ అనెను. ఇటులు ‘నీకో’లు వేనవేలు.

వృద్ధదాసి—‘ఎందుల కీవాదము? మగఁడే మందుకాని ఆఁడుది కలదా?’ అనెను. ఒకరి మొగము లొకరు చూచుకొనిరి. అందఱు తలాయొక పనిమీఁద వెళ్లిపోయిరి.

వెంకయ్యమ్మాగావు గారు ఆకాశము చూచుచు పండుకొనిరి. ఏమియు తోఁచక ఒకొక్క నక్షత్రమునే లెక్కపెట్టుచుండఁగా ప్రభాతమాయెను.

౪

ఇపుడు వెంకయ్యమ్మారావు పను లన్నియు దివానుపరము చేసెను. చేయి కడుగుకొని కూర్చుండెను. ఇపుడు తనకు పనిలేమియు లేవుకాని మనస్సులో ఒకపని ఉండెను. అది వేయిపనులపెట్టు.

ఆమె ఒకనాఁడు ముంజూరున వేలాడు పంజరమున మగచిలుకను స్వయముగా తీసి మరియొక పంజరమునఁ బెట్టి దూరముగా కట్టెను. రణగుణధ్వని: పండ్లు తినవు; నీరు త్రావవు. ఎగిరి బయటికి రాఁజూచును; ముక్కుతో కడ్డీలను పొడుచును; రివ్వున నెగిరికూలును.

వెంకయ్యమ్మా రావుగా రెంతో సేపు వాని వియోగమును సహింపలేక పోయెను. మరల రెంటిని ఏకపంజరమం దుంచెను. మరల మామూలు.

కొంత సేపటికి కీరవాణిని రావించెను. దానికి మంచిచీరయు, రైకయు ఇచ్చెను. కీరవాణి వానినితాల్చి అన్వర్థనామము కలదయి రాణికి నమస్కరించి సెలవు తీసికొనెను.

ప్రొద్దుపోయిన పిదప చిన్నమ్మారావు పడకటింటి ప్రక్కగా స్నానగృహమున కేఁగుచు వెంకయ్యమ్మారావు దంపతుల సరసాలాపముల వినెను. పులకలచే ఆమెకు స్నానము క్కఱ లేకపోయెను. ఆమె తనకు మరి రెండు చెవులు లేనందులకు కినిసెను. ఇఁక స్నానము లేదు; భోజనములేదు. శయన గృహమునకు వెనుదిరిగి పోయెను. పోయెనన్న మాటయే కాని నిదిరింపలేదు.

ఇంటిలో జనార్దనరావుగారి పటము లేదు; ఆయనవస్త్ర మేనియు లేదు.

ఆమె ఆలోచించి ఆలోచించి కొంతవడికి కొడుకు మంచముకడకు వెళ్లెను. అతనిని ఆచియూచి చూచెను. చూచిచూచి "నీవు నా చాఱ; నీవుకూడ నావలె కాఁగలవు; కాఁగల వేమిటి? ఐతివి. లేనిచో 'మాతండ్రి యేఁడి? అని అడుగవా?' అనెను.

చూడఁగాచూడఁగా వానిలో కొంత భర్త కవళిక కానవచ్చెను. నోరార ముద్దిడెను;

ముద్దిడి ముద్దిడి సిగ్గిలెను.

తెలవాఱకముందే జమానులను బిలిపించి జనార్దనరావుగారివిషయము కనుఁగొని రమ్మని పంపెను. వారు ఆర్వేటికి వెళ్లిరి.

వెనుక వెంకయ్యమ్మారావుగారు భర్త రచించుచున్న గ్రంథమును అతనిని బిలిచి అతని యెట్టెదుటనే తగులఁబెట్టఁ దలఁచెను. కాని అపు డతఁడు దాసిని బంపుమనఁగా అభిమానించి పెట్టెలోఁ బాఱవైచెను. దానిని నేఁడు పైకి దీసెను; చదివెను. తనపతి యిపుడు గోచరించెను. దానికి తా నొక పీఠిక వ్రాసెను.

భర్తయొక్క ఆంతరస్వరూపదర్శనమాత్రము తనకు తృప్తిజనకము కాకుండు టటుండ స్వస్వరూపదర్శనమునకు ఆమెను తొందర పెట్టెను. ఆమె ఆతొందరచే ఉడ్డుగుడిచినటు లుండెను.

ఆర్వేటినుండి జమానులు వచ్చి దేవర వారు వారికుటీరమున సుఖముగా నున్నారని మనవి చేసిరి.

"మరల పెండ్లాడియా?"

"అమ్మా, అదేమి? ప్రయత్నము చేసినను ఆయనకు మరి పెండ్లియగునా?"

"ఏమీ కాదేమి? మీకు తెలిసెఁ గాఁబోలు, చేఁదుమాట లోకప్పుడు తియ్యమాటలు, తియ్యమాట లొకప్పుడు చేఁదుమాటలు."

జమానులు వెళ్లిపోయిరి. వరాండాలో కుమారుఁడు దాదిపై కినియు మాటలు కొన్ని స్పష్టముగను, కొన్ని అస్పష్టముగను వినవచ్చుచుండెను. దాది బతిమాలుకొనుచుండెను. బాలుఁడు దాదిని లాఁగికొనివచ్చుచు "ఆఁగు! మాయమ్మతో చెప్పి నీపెండ్లి చేయించెదను" అనఁగా "బాబుగారు, బాబుగారు! చెప్పకుఁడు, చెప్పకుఁడు! రేపంతయు మిమ్ము బుజములమీఁద మోసి తిప్పెదను" అని దాది బతిమాలెను. బాలుఁడు "అమ్మా" యని కేక పెట్టెను. దాది వెలవెలపోవుచుండెను. తల్లి కుమారు నెదురుకొని "ఏమి నాయనా!" అని అడిగెను.

"చూడు, ఇది—నీకు నాయన ఏఁడీ?



అనుచున్నది. మానాయన ఏఁడీ? చూపు! ఆపైని దీనిపెండ్లి!"

"నాయనా! నీకును దానికిని చూపుదును; నేనును చూతును. లెండు; పోదము" అని అపుడే పయనించెను. బాలుని ఆనందమునకు మేర

లేదు. దాది సంతోషమును లోలోపల అణఁచుకొనెను. బాలుఁడు—"చూడు నీ పెండ్లి! మానాన్నవద్ద!" అని దాదిని బెదరించుచుండెను.

ఆమఱునాఁడే వా రార్వ్వడు చేరిరి. గ్రంథపర్యాలోచనము చేయుచున్న జనార్దనరావు రాణివాసము విడిచి నడిచి వచ్చుచున్న



తనభార్యను, దాదిచేతులనుండి కిందికి దుముకుచున్న కుమారుని జూచి తనకనులను తానే నమ్మఁజాలకపోయెను.

వెంకయ్యమ్మారావు సాష్టాంగపడి పుస్తకహస్తుఁడైన కుమారుని భర్త కందించెను.

అతఁడు కుమారుని మూర్కొని పుస్తకమెత్తి పీఠికనుజూచి పరవశుఁడాయెను.

రామనాథబాబు లోలోపల 'నే నిదివఱకు మానాయనను చూడలేదే' అనుకొని దాదికడకు వచ్చి తండ్రిని జూపి చఱచెను. దాదికి ఆచఱపే సమ్మోదమాయెను.

"తుదకు పెంపుడు చిలుకకడకే వచ్చితివా?"

"క్షమింపుఁడు, క్షమింపుఁడు! నేనే యిపుడు పెంపుడుచిలుకనై వచ్చితిని."